నేటి మ్యాచ్
పాకిస్థాన్ X బంగ్లాదేశ్
మ. 2.00 నుంచి
వేదిక: కోల్‌కతా

తెలంగాణ తీన్‌మార్

జాతీయ క్రీడల్లో 3 పతకాలు

ముస్తాఖ్

గోవా: జాతీయ క్రీడల్లో తెలంగాణ అథ్లెట్లు సత్తా చాటుతున్నారు. గోవా వేదికగా జరుగుతున్న 37వ నేషనల్ గేమ్స్‌లో సోమవారం మన రాష్ట్రానికి మూడు పతకాలు వచ్చాయి. స్విమ్మింగ్‌లో ప్రితి అగర్వాల్ రజత వెలుగులు విరజిమ్మగా.. బిలియర్డ్స్‌లో ముస్తాఖ్ ఖాన్ సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. ఇక పురుషుల ఫెన్సింగ్‌లో తెలంగాణ జట్టుకు కాంస్య పతకం లభించింది. మహిళల స్విమ్మింగ్ ఫ్రీస్టైల్ 800 మీటర్ల విభాగంలో బరిలోకి దిగిన ప్రితి అగర్వాల్ రెండో స్థానంలో నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్లో ప్రితి 9 నిమిషాల 14.58 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రజతం కైవసం చేసుకుంది. భవ్య సచ్‌దేవ్ (9 నిమిషాల 08.60 సెకన్లు; ఢిల్లీ), షీరీన్ (9ని.29.08 సె.; కర్ణాటక) వరుసగా స్వర్ణ, కాంస్యాలు దక్కించుకున్నారు. ఇటీవలి కాలంలో జాతీయ అంతర్జాతీయ పోటీల్లో నిలకడగా రాణిస్తున్న ప్రితి.. నేషనల్ గేమ్స్‌లోనూ అదే జోరు కనబర్చింది. కొలనులో చేపను తలపిస్తూ.. పతకంతో మెరిసిన ప్రితిని తెలంగాణ స్విమ్మింగ్ సంఘం ప్రతినిధులు, కోచ్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రితి అగర్వాల్

ముస్తాఖ్ ఖాన్‌కు రజతం

జాతీయ క్రీడల్లో నిలకడైన ప్రదర్శన కనబరుస్తున్న తెలంగాణ స్నూకర్ ప్లేయర్ ముస్తాఖ్ ఖాన్ ఫైనల్లో పరాజయం పాలై రజతం దక్కించుకున్నాడు. సోమవారం హోరాహోరీగా సాగిన తుది పోరులో ముస్తాఖ్ 2-3 తో ఉత్తరప్రదేశ్‌కు చెందిన పారస్ గుప్తా చేతిలో ఓడాడు. జాతీయ క్రీడల్లో అరంగేట్రం చేసిన తొలిసారే ముస్తాఖ్ చక్కటి ప్రదర్శన కనబర్చాడు. తొలి రెండు సెట్లు కోల్పోయి వెనుకబడ్డ ముస్తాఖ్.. ఆ తర్వాత తేరుకొని వరుసగా రెండు సెట్లు నెగ్గి పోటీలోకి వచ్చినా.. ఉత్కంఠ భరితంగా సాగిన నిర్ణయాత్మక సెట్‌లో పరాజయం తప్పలేదు. మరోవైపు మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో తెలుగమ్మాయి జ్యోతి ఎర్రాజి రికార్డు టైమింగ్ (13.22 సెకన్లు)తో పసిడి పతకం ఖాతాలో వేసుకుంది.

ఫెన్సింగ్‌లో కాంస్యం..

పురుషుల ఫెన్సింగ్ ఇపీ కేటగిరీలో లోకేశ్, పవన్, మురళి, వంశీతో కూడిన తెలంగాణ జట్టు కాంస్య పతకం నెగ్గింది. ఈ విభాగంలో సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు బంగారు పతకం గెలుచుకోగా.. మధ్యప్రదేశ్‌కు సిల్వర్ మెడల్ దక్కింది.

అనీష్‌కు కాంస్యం

న్యూఢిల్లీ : కొరియాలో జరుగుతున్న ఆసియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో అనీష్ భన్వాలా కాంస్య పతకం గెలుచుకున్నాడు. పురుషుల 25మీ. పిస్టల్ ఫైర్ విభాగం ఫైనల్లో 21 ఏళ్ల అనీష్ షూటౌట్‌లో జపాన్‌కు చెందిన దయ్ యొషివోక చేతిలో ఓడి కాంస్యానికి పరిమితమయ్యాడు. ఈ ప్రదర్శనతో అనీష్ వచ్చే యేడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను దక్కించుకున్నాడు. కాగా కొరియాకు చెందిన లీ గన్‌మ్యోక స్వర్ణం సొంతం చేసుకున్నాడు. పురుషుల ట్రాప్ విభాగంలో జొరావర్ సింగ్, కైనన్ షెనాయ్, పృథ్వీరాజ్ తొండైమన్‌లతో కూడిన భారత జట్టు కేవలం మూడు పాయింట్ల తేడాతో రజత పతకానికి పరిమితమైంది.

అంకుల్ పెర్సీ అస్తమయం

కొలంబో: శ్రీలంక క్రికెట్ జట్టు వీరాభిమాని పెర్సీ అభయశేకర ఇక లేరు. ఆ జట్టు ఆడే అంతర్జాతీయ మ్యాచ్‌లకు హాజరై క్రికెటర్లకంటె ఎక్కువ హల్‌చల్ చేస్తూ అందరినీ ఆకట్టుకునేవారు. అంకుల్ పెర్సీ అని అభిమానంతో పిలుచుకునే అభయశేఖర సోమవారం మరణించారు. 87 ఏళ్ల పెర్సీ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన వైద్యంకోసం క్రికెట్ శ్రీలంక రూ.50 లక్షలు ఆర్థిక సాయంకూడా చేసింది. పెర్సీ మరణం పట్ల ఆ దేశ దిగ్గజ ఆటగాళ్లు సనత్ జయసూర్య, రస్సెల్ ఆర్నాల్డ్ తదితరులు సంతాపం వ్యక్తంచేశారు. ఇటీవల ఆసియా కప్‌లో భాగంగా శ్రీలంక పర్యటన సందర్భంగా భారత కెప్టెన్ రోహిత్ శర్మకూడా పెర్సీని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నాడు.

హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్.. పోర్చుగల్ సాకర్ దిగ్గజం ఎస్ఎల్ బెన్ఫికాతో సాంకేతిక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఇకపై యువ ఆటగాళ్లకు బెన్ఫికా తరహాలో శిక్షణ అందించనున్నట్లు శ్రీనిధి క్లబ్ ప్రతినిధులు వెల్లడించారు

అగ్రస్థానానికి అర్జున్

ఐజిల్ ఆఫ్ మ్యాన్ : అప్రతిహతంగా సాగుతున్న తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగైసి ఫిడే గ్రాండ్ స్విస్ టోర్నీలో అయిదో రౌండ్ ముగిసేసరికి మరో ఇద్దరితో కలిసి అగ్రస్థానంలో నిలిచాడు. అయిదు రౌండ్లలో నాలుగు పాయింట్లు సాధించిన అర్జున్ అమెరికాకు చెందిన హికారు నకమురా, రష్యా ఆటగాడు ఆండ్రీ ఎసిపెంకొలతో కలిసి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అయిదో రౌండ్‌లో అర్జున్ 69 ఎత్తులలో కజకస్థాన్‌కు చెందిన రినత్ జుమబయేవ్‌ను ఓడించగా, నకమురా సెర్బియాకు చెందిన అలెక్సీ సరనపై గెలిచాడు. ఎసిపెంకొ అమెరికాకు చెందిన టాప్‌సీడ్ ఫాబియానొ కరునాతో మ్యాచ్‌ను డ్రా చేసుకున్నాడు. ఇతర భారత ఆటగాళ్లలో విదిత్ గుజరాతి, పి.హరికృష్ణ, నిహాల్ సరీన్ తమ మ్యాచ్‌లను డ్రాగా ముగించగా, గుకేష్, రౌనక్ సంధ్వాని ఓటమి చవిచూశారు.

ఇంజమామ్ రాజీనామా

లాహోర్: పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)లో ప్రకంపనలు మొదలయ్యాయి. వన్డే ప్రపంచకప్‌లో ఆ జట్టు పేలవ ఆటతీరు కనబరుస్తుండగా.. పీసీబీలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రస్తుతం జట్టుకు చీఫ్ సెలెక్టర్‌గా వ్యవహరిస్తున్న మాజీ కెప్టెన్ ఇంజమామ్ ఉల్ హక్ సోమవారం తన పదవికి రాజీనామా చేశాడు. ఆ లేఖను పీసీబీ చీఫ్ జకా అష్రఫ్‌కు పంపించాడు. ఆటగాళ్ల ఎంపికలో అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇంజమామ్ మాట్లాడుతూ.. 'వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం తగదు. ఈ అంశంపై పీసీబీ విచారణ చేపట్టాలి. నాకు ప్లేయర్ ఏజెంట్ కంపెనీలతో ఎలాంటి సంబంధం లేదు' అని అన్నాడు.

అఫ్గాన్ అదుర్స్

శ్రీలంకపై ఘనవిజయం • మెరిసిన ఫజల్‌హక్

ఫజల్ హక్ (4/34)

వన్డే ప్రపంచకప్‌లో చిన్న జట్టుగా ప్రస్థానాన్ని ప్రారంభించిన అఫ్గాన్ అద్వితీయ ఆటతీరుతో దూసుకెళ్తున్నది. ఇప్పటికే ఇంగ్లండ్, పాకిస్థాన్‌లను మట్టికరిపించిన కాబూలీలు.. తాజాగా లంకేయులపై తమ ప్రతాపం చూపారు. మొదట కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లంకను కట్టడి చేసిన అఫ్గాన్ ఆ తర్వాత.. సాధికారిక బ్యాటింగ్‌తో ప్రపంచకప్‌లో మూడో గెలుపు ఖాతాలో వేసుకుంది. ఈ మూడు విజయాలు మాజీ చాంపియన్లపైనే కావడం మరో విశేషం.

పుణె: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన అఫ్గానిస్థాన్ ప్రతిష్ఠాత్మక వన్డే వరల్డ్‌కప్‌లో వరుసగా రెండో విజయం ఖాతాలో వేసుకుంది. గత మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను చిత్తు చేసిన అఫ్గాన్.. ఈసారి లంకను అవలీలగా దాటేసింది. సోమవారం జరిగిన పోరులో అఫ్గాన్ 7 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలిచింది. దీంతో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో 6 పాయింట్లు ఖాతాలో వేసుకున్న అఫ్గాన్ పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి చేరింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన లంక 49.3 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. పాథుమ్ నిషాంక (46) టాప్ స్కోరర్ కాగా.. కెప్టెన్ కుషాల్ మెండిస్ (39), సదీర సమరవిక్రమ (36) పర్వాలేదనిపించారు. తక్కినవాళ్లకు కూడా మంచి ఆరంభాలు లభించినా వాటిని భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. చివర్లో ఏంజెలో మాథ్యూస్ (23), తీక్షణ (29) విలువైన పరుగులు చేశారు. అఫ్గాన్ బౌలర్లలో ఫజల్ హక్ 4 వికెట్లు పడగొట్టగా.. ముజీబ్ రెండు వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనలో అఫ్గానిస్థాన్ 45.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. అజ్మతుల్లా ఓమర్‌జాయ్ (73 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్సర్లు), రహ్మత్ షా (62; 7 ఫోర్లు), కెప్టెన్ హష్మతుల్లా షాహిది (58 నాటౌట్) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. లంక బౌలర్లలో మధుషనక 2 వికెట్లు పడగొట్టాడు. ఫజల్‌హక్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'అవార్డు దక్కింది.

1 వరల్డ్‌కప్ చరిత్రలో అత్యధిక పరాజయాలు (43) మూటగట్టుకున్న జట్టుగా లంక రికార్డుల్లోకి ఎక్కింది. జింబాబ్వే (42) రెండో స్థానంలో ఉంది.

వన్డే ప్రపంచకప్‌లో భాగంగా అఫ్గాన్ తొలుత ఆడిన 17 మ్యాచ్‌ల్లో కేవలం ఒక్క విజయం మాత్రమే (స్కాట్లాండ్‌పై 2015లో) నమోదు చేసుకోగా.. తాజా టోర్నీలో ముగ్గురు మాజీ చాంపియన్లను చిత్తుకింద కొట్టింది.

ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

దే	ఆ	గె	ఓ	ర.రే.	పా
భారత్	6	6	0	+1.40	12
దక్షిణాఫ్రికా	6	5	1	+2.03	10
న్యూజిలాండ్	6	4	2	+1.23	8
ఆస్ట్రేలియా	6	4	2	+0.97	8
అఫ్గానిస్థాన్	6	3	3	-0.71	6
శ్రీలంక	6	2	4	-0.27	4
పాకిస్థాన్	6	2	4	-0.38	4
నెదర్లాండ్స్	6	2	4	-1.27	4
బంగ్లాదేశ్	6	1	5	-1.33	2
ఇంగ్లండ్	6	1	5	-1.65	2

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

సంక్షిప్త స్కోర్లు

శ్రీలంక: 49.3 ఓవర్లలో 241 ఆలౌట్ (నిషాంక 46; ఫజల్‌హక్ 4/34, ముజీబ్ 2/38), **అఫ్గానిసాన్:** 45.2 ఓవర్లలో 242/3 (అజ్మతుల్లా 73 నాటౌట్, రహ్మత్ షా 62; మధుషనక 2/48).

పాకిస్థాన్ X బంగ్లాదేశ్

కోల్‌కతా: వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ రేసు నుంచి అధికారికంగా తప్పుకున్న బంగ్లాదేశ్‌తో.. ఏమూలో చిన్న ఆశ ఉన్న పాకిస్థాన్ జట్టు అమీతుమీకి సిద్ధమైంది. మంగళవారం ఈడెన్ గార్డెన్స్‌లో బంగ్లాపై గెలిచి సెమీస్ రేసులో సజీవంగా ఉండాలని పాక్ భావిస్తుంటే.. చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించడమే ఇప్పుడు తమ లక్ష్యమని బంగ్లా కెప్టెన్ షకీబ్ అల్ హసన్ వెల్లడించాడు. వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిన పాకిస్థాన్ బంగ్లాపై ఎలాంటి ప్రదర్శన కనబరుస్తుందో చూడాలి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.